ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
జగిత్యాల
జిల్లా వార్తలు
5★★
సోమవారం 22 జూలై 2024





సారంగాపూర్‌లో వర్షపు నీటితో నిండుకుంటున్న చెరువు



మత్తడి దూకుతున్న రాయికల్ పెద్ద చెరువు

ముసురుకున్న వాన

ఈ యేడు వరుణదేవుడు కరుణిస్తాడా లేడా అన్న సందిగ్ధంలో ఉన్న అన్నదాతలకు కాస్త ఊరట లభించింది. వానాకాలం మొదలై రోజులు గడుస్తున్నా వర్షం జాడ లేకపోవడంతో రైతులు ఆందోళన చెందారు. ఆశించిన స్థాయిలో వర్షాలు లేకపోవడంతో గట్టెక్కేదెలా అని ఆలోచనలో పడ్డారు. కానీ రెండు రోజులుగా జిల్లా వ్యాప్తంగా కురుస్తున్న వర్షంతో రైతన్నలు సంబరపడిపోతున్నారు. చెరువులు, కుంటలు జలకళను సంతరించుకోవడంతో ఊపిరి పీల్చుకున్నారు.

- రెండు రోజులుగా ఎడతెరిపిలేని వర్షం
- చెరువులు, కుంటల్లోకి వర్షపు నీరు
- లో లెవల్ కల్వర్టులపై నుంచి ప్రవాహం
- ప్రవహిస్తున్న వాగులు, గోదావరి
- ముందస్తు చర్యల్లో కలెక్టర్, ఎస్పీ

జగిత్యాల, జూలై 21 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా వరసగా రెండవ రోజు ఆదివారం ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తూనే ఉంది. దీంతో గోదా వరి, వాగులు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. లో లెవల్ కాజ్‌వేలపై నుంచి వరద నీరు భారీగా ప్రవహిస్తుండడంతో పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. పలు మండలాలు, పట్టణాల్లో పాత ఇళ్లు పాక్షికంగా దెబ్బ తిన్నాయి. పంట చేలులోకి వర్షపు నీరు చేరి మునిగాయి. చెరువులు, కుంట లు, ఇతర చిన్న నీటి వనరుల్లోకి వర్షపు నీరు వచ్చి చేరుతోంది. అత్యవసర పరిస్థితుల్లో సహాయక చర్యలు తీసుకోవడానికి అధికార యంత్రాంగం సిద్ధంగా ఉంది. కలెక్టర్ సత్య ప్రసాద్, ఎస్పీ అశోక్ కుమార్‌ల నేతృత్వంలో రెవెన్యూ, పోలీసు అధికారులు అవసరమైన చర్యలు తీసుకుంటున్నారు.

● మబ్బు పట్టి...ముసురు పెట్టి

బంగాళఖాతంలో ఏర్పడిన వాయుగుండం, అల్పపీడనాల కారణంగా జి ల్లా వ్యాప్తంగా వర్షం కురుస్తూనే ఉంది. అన్ని ప్రాంతాల్లో శుక్రవారం రాత్రి నుంచి ఆదివారం రాత్రి వరకూ ముసురు పెట్టింది. వాతావరణం ఒక్కసా రిగా మారిపోయింది. రోజంతా మబ్బు పట్టి వాన కురుస్తూనే ఉంది. చిరు వ్యాపారులు, రైతులు, ఇతర పనులు చేసుకునే వారు రోజంతా ఇబ్బందులు పడ్డారు. రోడ్లన్నీ జలమయమవడం, బురదమయం కావడంతో రాకపోకల కు ఇబ్బందులు ఏర్పడ్డాయి. జిల్లాలో అసలైన వానాకాలం సీజన్ ప్రారంభ మైనట్లు కనిపించింది. రోజంతా ముసురపెట్టి వర్షం కురుస్తుండడంతో భూగర్భ జలాలు పెరిగాయి. క్రమంగా చెరువులు, కుంటలు, బోరు బావుల్లో నీటి మట్టం పెరుగుతోంది.

● నిలిచిన రాకపోకలు...

కథలాపూర్ మండలంలోని భూషన్‌రావుపేట - నిజామాబాద్ జిల్లా కోనాపూర్ రోడ్డు వర్షం వల్ల బురదమయంగా మారి రాకపోకలు నిలిచిపోయాయి. ఇబ్రహీంపట్నం మండలం యామాపూర్ - పకీర్ కొండాపూర్, వర్షకొండ - ఇబ్రహీంపట్నంల మధ్య లోలెవల్ కల్వర్టులపై నుంచి వరద నీరు పారుతుండడంతో రాకపోకల నిలిచిపోయాయి. జగిత్యాల, కోరుట్ల, మెట్‌పల్లి, రాయికల్, ధర్మపురి మున్సిపాలిటీల్లోని పలు వార్డులు, కాలనీల్లో రహదారులపై వరద నీరు ప్రవహించింది. మురికి కాలువలు పొంగి పొర్లాయి. లోతట్టు ప్రాంతాల్లో వర్షపు నీరు నిలిచి కొంత ఇబ్బందులు ఏర్పడాయి. రోజంతా ముసురు వర్షం వల్ల సాధారణ జనజీవనానికి కొంత అంతరాయం ఏర్పడింది.

● సాగుకు ప్రాణం పోసిన వర్షాలు...

మొన్నటి వరకు వర్షాబావ పరిస్థితులు ఏర్పడటంతో వానాకాలం సీజ న్‌పై అన్నదాతల ఆశలు సన్నగిల్లాయి. నీటి వనరులు, చెరువులు, కుంటలు బోసి పోతూ కనిపించాయి. వర్షాలు లేకపోవడంతో వరి నార్లు ముదిరి పోయాయి. ఇతర పంటలు వాడిపోయాయి. ఆరుగాలం కష్టించి అన్నదాత కు ఈ సీజన్ కష్టాలు తెచ్చి పెడుతున్న క్రమంలో వరుణుడు కరుణిం చాడు. రెండు రోజుల నుంచి కురుస్తున్న వర్షాలతో అన్నదాతలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. బోరుబావుల ఆధారంగా వరినారు వేసుకున్న పలువురు రైతులు ప్రస్తుతం వరినాట్లు వేస్తున్నారు. మొక్కజొన్న, పత్తి, పసుపు, పప్పు ధాన్యాలు, ఇతర ఆరుతడి పంటలకు ఈ వర్షం ఎంతో మేలు చేసింది. చెరువుల్లోకి నీరు వచ్చి చేరుతుండడంతో వీటికింద వరి పంట సాగు చేసేందుకు అన్నదాతలు సన్నద్ధమవుతున్నారు.

జగిత్యాల టౌన్ : జగిత్యాల జిల్లా కేంద్రంలో రెండవ రోజు ఆదివారం ఎడతెరిపి లేకుండా ముసురు వర్షం కురిసింది. పట్టణంలోని లోతట్టు ప్రాం తాలతో పాటు ప్రధాన రహదారులు పూర్తిగా బురదమయ మయ్యాయి. ప్రజలు బయటకు రాకపోవడంతో టవర్ ప్రాంతంతో పాటు ప్రధాన రహ దారులు బోసిపోయాయి. పట్టణంలోని లోతట్టు ప్రాంతాలను మున్సిపల్ చైర్ పర్సన్ అడువాల జ్యోతి పరిశీలించారు. 19వ వార్డులోని బైపాస్ రోడ్ లో రహదారి ప్రక్కన ప్రమాద కరంగా ఉన్న కల్వర్టును పరిశీలించి తక్షణ మే మరమ్మతులు చేయాలని అధికారులకు చైర్ పర్సన్ ఆదేశాలు జారీ చేశారు. శానిటేషన్ అధికారులు ఉన్నారు.

మల్యాల: రెండు రోజులుగా ఎడితెరపి లేకుండా ముసురుతో మండల ప్రజలు ఇక్కట్లు పడుతున్నారు. ముసురుతో కూడిన వర్షానికి తక్కళ్లపల్లి శి వారులోని ఎల్లమ్మ చెరువు మత్తడి దూకుతుంది. రామన్నపేట- రాంపూర్ మార్గంలో గుంతలలో నీరు నిలిచి రాకపోకలకు తీవ్ర అసౌకర్యంగా మా రింది. ప్రజలు అత్యవసరమైతే తప్ప బయటకు రావద్దని అత్యవసర సమయంలో 100నంబర్‌కు ఫోన్ చేయాలని ఎస్సై నరేష్‌కుమార్ సూచించారు. చెరువులు, కుంటల వద్దకు వెళ్లవద్దని, శిథిలమైన ఇళ్లలో ఉండవద్దని అన్నారు. జాలర్లు చేపలు పట్టేందుకు చెరువులు, కుంటల వద్దకు వెళ్ల రాదని పేర్కొన్నారు. మల్యాలలోని పలు చెరువులను ఎస్సై పరిశీలించి మండల ప్రజలు వర్షాలతో అప్రమత్తంగా ఉండాలని కోరారు.

ఎండపల్లి: ఎండపల్లి మండలంలో రెండు రోజులుగా వర్షం ఎడతెరపి లేకుండా కురిసింది. వర్షానికి చెరువులు, కుంటల్లో నీరు వచ్చి చేరింది. రైతుల వ్యవసాయ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. వర్షాన్ని సైతం లెక్క చేయకుండా కూలీలు నాట్లు వేస్తున్నారు. వర్షాల దృష్ట్యా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. మండలంలో ఎలాంటి సమస్య ఉన్నా ఉమ్మడి మండలం వెల్గటూర్ పోలీసులు 8712656827కు సమాచారం అందించాలన్నారు.

సారంగాపూర్: రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షానికి మండలంలోని ఆయ గ్రామాల్లో ఉన్న చెరువులు, కుంటలు నిండు కుండలను తలపిస్తున్నాయి. అన్న దాతలు సంతోషం వ్యక్తం చేస్తూ పొలం పనుల్లో నిమగ్నమయ్యారు. పొలం నాట్లు వేసేందుకు కూలీల కొరత అప్పుడే ఏర్పడింది. మండలంలోని బట్టపల్లి కొత్త కుంటలో వేసవిలో అయితే చుక్క నీరు ఉండదు. ప్రస్తుతం కుంట పూర్తి స్థాయిలో నిండి మత్తడి దూకి పారుతోంది.

కొడిమ్యాల: మూడు రోజులుగా కురుస్తున్న వర్షానికి మండలంలోని పో తారం పెద్ద చెరువు నిండి మత్తడి దూకుతోంది. దీంతో కొడిమ్యాల పెద్ద వా గు పారుతోంది. వాగుకు అడ్డంగా నిర్మించిన చెక్‌డ్యాంలు నిండుకుండలా మారాయి. పోతారం చెరువు నుంచి వాగుకు ఇరు వైపుల ఉన్న వ్యవసా య బావుల్లో, బోరు బావుల్లో నీటి మట్టం పెరు గుతుందని పలువురు రైతులు హర్షం వ్యక్తం చేశారు.

రాయికల్: మూడు రోజులుగా కురుస్తున్న వర్షానికి మండలంలోని వాగులు వంకలు పొంగి పొర్లుతున్నాయి, రాయికల్ పెద్ద చెరువు మత్తడి దూకగా నీరు ప్రవహించగా పలు గ్రామాల్లో నీరు ఇళ్లలోకి చేరుతుంది.

ధర్మపురి: ధర్మపురి మండలంలో ఆదివారం భారీ వర్షం కురిసింది. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. గ్రామాల్లో చెరువులు, కుంటలు నిండి పోయాయి. రోడ్లు జలమయం కావటం వల్ల అనేక చోట్ల దెబ్బ తిని ప్రజలకు నష్టం వాటిల్లింది. రైతులు, వ్యవసాయ కూలీలు పనులు చే సేందుకు బయటకు రాలేదు. బట్టపల్లి, నేరెళ్ల గుట్టల వద్ద నుంచి వచ్చిన వ రద నీరు అక్కపల్లి చెరువులో చేరింది. ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ వరద పరిస్థితి గురించి ఇరిగేషన్ శాఖ అధికారుల ను అడిగి తెలుసుకున్నారు. ప్రమాదాలు జరుగకుండా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. సీఐ రాంనర్సింహారెడ్డి ఆధ్వర్యంలో ఎస్ఐ ఉదయ్‌కుమార్ సిబ్బంది ప్రజలను అప్రమత్తం చేశారు. ఆకుసాయిపల్లె అంజ నేయస్వామి ఆలయం చుట్టు నీరు చేరింది. తహసీల్దార్ కృష్ణచైతన్య ఆధ్వ ర్యంలో రెవెన్యూ సిబ్బంది వరద పరిస్థితి గురించి ఉన్నతాధికారులకు సమాచారం అందించారు.

● పెరుగుతున్న గోదావరి ప్రవాహం...

జిల్లాలోని వెల్గటూరు మండలం కోటిలింగాల వద్ద గోదావరిలోకి వరద నీరు చేరి నీటి మట్టం పెరుగుతోంది. కడెం ప్రాజెక్టు 3 గేట్లు ఎత్తి వేసి 14,436 క్యూసెక్కుల నీటిని దిగువవకు వదులుతుండడంతో ధర్మపురి శ్రీలక్ష్మీ నృసింహస్వామి దేవస్థాన కేంద్రంలో గల గోదావరి ఉధృతి పెరిగి వ రద నీరు పుష్కర స్నాన ఘట్టాలను ఆనుకొని ప్రవహిస్తోంది. జిల్లాలోని ఇబ్రహీంపట్నం, మల్లాపూర్, రాయికల్ తదితర మండలాల్లో సైతం గోదా వరి ప్రవాహం పెరిగింది.

మెట్‌పల్లి రూరల్: మండలంలోని వెల్లుల్ల గ్రామంలో మూడు రోజులు గా కురుస్తు్న వర్షానికి రోడ్డు అడ్డంగా చెట్టు కూలింది. ఈదురుగాలులతో కూడిన కురిసిన వర్షంతో గ్రామ శివారులోని రహదారిపై భారీ వృక్షం నేల కొరిగింది. దీంతో ఇరువైపులా రహదారిపై రాకపోకలు నిలిచాయి. పోలీసు లు అక్కడికి చేరుకుని ఎవరికి ఎలాంటి ప్రమాదం జరగకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. పంచాయతీ కార్యదర్శి నారాయణ సిబ్బందితో పాటు గ్రామ స్థుల సహకారంతో చెట్టును తొలగించి రాకపోకలు కొనసాగించారు.

● ఎండపల్లిలోనే అధికం...

జిల్లా వ్యాప్తంగా ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు సగటున 21.91 మిల్లీ మీటర్ల వర్షం పడింది. అత్యధికంగా ఎండపల్లి, ఎండపల్లి మండలం గుల్లకోటలో 18.3 మిల్లీమీటర్లు, పెగడపల్లిలో 13.5 మిల్లీ మీటర్లు, జగిత్యాల 11.5, ఎండపల్లి మండలం మారెడుపల్లి 9.5, బు గ్గారం మండలం సిరికొండ 9.3, రాయికల్ 7.8, కొడిమ్యాల మండలం తిరుమలాపూర్ 6.3, ధర్మపురి మండలం నేరేళ్ల 5.5, కొడిమ్యాల మండలం పూడూరు 5.3, గొల్లపల్లి 5.3, మెట్‌పల్లి 5.0, ధర్మపురి మండలం జైనా, మల్యాల 5.0, రాయికల్ మండలం అల్లీపూర్ 4.5, మల్యాల మండలం మ ద్దుట్ల 4.0, వెల్గటూరు 3.8, కోరుట్ల 3.5, మల్లాపూర్ 2.8, బీర్‌పూర్ మం డ లం కొల్వాయి 2.5, మల్లాపూర్ మండలం రాఘవపేట 1.8, మెట్‌పల్లి మండలం జగ్గసాగర్, కథలాపూర్ 1.5, బీమారం మండలం మన్నెగూడెం, బీ మారం మండలం గోవిందారంలో 1.0, ఇబ్రహీంపట్నం మండలం గోదూరు 0.5 మిల్లీ మీటర్ల వర్షం కురిసింది.

మల్లాపూర్: మండలంలో మూడు రోజుల నుంచి కురుస్తున్న వర్షాలతో గ్రామాల్లోని చెరువులు, కుంటాలు జలకళతో సంతరించుకున్నాయి. మండలంలోని గోదావరి పరివాహక గ్రామాలను తహసీల్దార్ వీర్‌సింగ్‌తో పాటు మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, నాయకులు పరిశీలించారు. నది ఉధృతంగా ప్రవహిస్తున్నందును అటు వైపు ఎవరు వెళ్లొద్దం టూ ప్రజలకు అధికారులు సూచించారు. ముత్యంపేట, మల్లాపూర్ గ్రామా ల్లోని రెండు పెంకుటిండ్లు కూలిపోయాయి. వాటిని తహసీల్దార్ పరిశీలించి వివరాలను సేకరించారు.

కోరుట్ల/కోరుట్ల రూరల్: కోరుట్ల పట్టణంతో పాటు మండలంలోని అన్ని గ్రామాలలో రెండు రోజల నుంచి ఎడతెరువకుండా వర్షం కురవడం తో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. పట్టణంలోని లోతట్టు ప్రాంతాలు జలమయం కాగా ఇండ్ల మధ్య నిలిచిన నీటిని మున్సిలప్ సిబ్బంది జేసీబీ సహా యంతో తొలగించారు. తాత్కాలిక కాల్వను ఏర్పాటు చేశారు. పట్టణంలో ని పలు వార్డులను మున్సిపల్ చైర్మన్ గడ్డమీది పవన్ పరిశీలించి పారిశుధ్య కార్మికులకు పలు సూచనలు చేసారు. మండలంలోని అన్ని గ్రామాలలో వర్షం కురువడంతో గ్రామస్థులు ఇబ్బందులను ఎదుర్కొన్నారు.



ధర్మపురి మండలంలోని ఆకుసాయిపల్లె వద్ద నుంచి అక్కపెల్లి చెరువులోకి భారీగా చేరుతున్న నీరు



జగిత్యాలలో లోతట్టు ప్రాంతాలను పరిశీలిస్తున్న చైర్‌పర్సన్



మల్యాలలో చెరువును పరిశీలిస్తున్న ఎస్సై

నేటి నుంచి పాఠశాలలకు కొత్త పనివేళలు

●దూర ప్రాంతాల విద్యార్థులకు ఇబ్బంది
●బయోమెట్రిక్ విధానం లేకపోవడంపై సందేహాలు..?



ప్రభుత్వ పాఠశాల భవనము

జగిత్యాల అర్బన్, జూలై 21: ప్రభుత్వ ఉన్నత పాఠశాలల పని వేళలకు సంబంధించి విద్యాశాఖ కీలక నిర్ణయం తీసుకుంది. దీనిలో భాగంగా పనివేళల మార్పును సూచిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ప్రభుత్వ ఉన్నత పాఠశాలల సమయం ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 4.15 గంటల వరకు పనిచేయనున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొంది. ఇప్పటివరకు ఉన్నత పాఠశాలలు ఉదయం 9:30గంటల నుంచి సాయంత్రం 4:45 గంటల వరకు పనిచేస్తున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ప్రైమరీ, అప్పర్ ప్రైమరీ స్కూల్‌లు యధావిధిగా ఉదయం 9గంటల నుంచి సాయం త్రం 4:15 గంటల వరకు కొనసాగుతాయని విద్యాశాఖ అధికారులు స్ప ష్టం చేశారు. నూతన పనివేళల మార్పు ఉన్నత పాఠశాలల విద్యార్థులకు ఇబ్బందిగా మారుతుందనే ప్రచారం జరుగుతుంది.

● పర్యవేక్షణ లోపం...

జిల్లాలో విద్యావ్యవస్థ పరిస్థితి అత్యతం దారుణంగా తయారైంది. పర్య వేక్షణ లోపం విద్యావ్యవస్థకు, విద్యార్థులకు శాపంగా మారింది. జిల్లాలోని 20మండలాల్లో మండలానికి ఒక మండల విద్యాశాఖ అధికారి ఉండాల్సి ఉండగా ఒక్క మండలానికి కూడా పూర్తిస్థాయి ఎంఈవో లేకపోవడం గ మనార్హం. జిల్లాలో ప్రైమరీ పాఠశాలలు 508, అప్పర్ ప్రైమరీ పాఠశాలలు 86, ఉన్నత పాఠశాలలు 188 వరకు ఉన్నాయి. ఇందులో అన్ని కేట గిరిలకు చెందిన సుమారు 3200 మంది ఉపాధ్యాయులు పని చేస్తుండగా, 180 మంది హెచ్‌ఎంలున్నారు. ప్రస్తుతం జిల్లాలో ఏ డుగురు హెచ్ ఎంలకు ఎంఈవోలుగా అదనపు బాధ్యతలు కల్పించి వారికి ఒక్కొక్కరికీ రెండునుంచి మూడు మండలాలకు ఎంఈవోలుగా అదనపు బాధ్యతలు కల్పించారు. దీంతో పాఠశాలల పర్యవేక్షణ ప్రహసనంగా మారింది.

●పనివేళల మార్పు సక్రమంగా సాగేనా..?

తెలంగాణ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం ఉన్నత పాఠశాలల విద్యార్థులకు ఇబ్బందిగా మారే పరిస్థితులుంటాయని విద్యావేత్తలు భావిస్తున్నారు. క్షేత్రస్థాయిలో చాలా ప్రాంతాల్లో ఒక పాఠశాల కేంద్రంగా కనీసం 3నుంచి 5కిమీలు నుంచి విద్యార్థులు వచ్చే పరిస్థితులున్నాయి. దీంతో సమయపాలన సాధ్యాసాధ్యాలపై అనుమానాలు కలుగుతుంది. ఇదిలా ఉంటే ఉపాధ్యాయులకు కరోనాకు ముందు, కరోనా తర్వాత కొద్ది రోజుల వరకు బయోమెట్రిక్ విధానం అమలులో ఉండేది. కానీ కొన్ని నెలలుగా ఈ విధానం అమలుకాకపోవడంతో పర్యవేక్షణ కష్టతరంగా మారింది. ఇదిలా ఉంటే పాఠశాలలకు సమయ వేళల మార్పుపై ఉన్నత పాఠశాలల్లో అనాసక్తి నెలకొంది. ఉదయం నుంచి సాయంత్రం వరకు సాధారణ తరగతులు నిర్వహిస్తూ సాయం త్రం తర్వాత ప్రత్యేక తరగతుల నిర్వహణ ఉంటుంది. ఈ మార్పుతో దూరప్రాంత విద్యార్థులకు ఇబ్బంది కలుగుతుందనే భావన వ్యక్తం అవుతుంది.

ఉత్తర్వుల అమలుకు చర్యలు తీసుకుంటాం

జగన్మోహన్ రెడ్డి, జిల్లా విద్యాశాఖ అధికారి

ప్రభుత్వ ఉత్తర్వులను తూచా తప్పకుండా నేటి నుంచి అమలు చేసేందుకు చర్యలు తీసుకుంటాం. జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో పాఠశాలల మానిటరింగ్ చే స్తాం. తరగతుల నిర్వహణ, ఉపాధ్యాయుల పనితీరును ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తాం.

ఉత్తర్వులను స్వాగతిస్తున్నాం

భోనగిరి దేవయ్య, తపస్ జిల్లా అధ్యక్షుడు

జిల్లాలో ఉన్నత పాఠశాలల పనివేళల మార్పుపై ప్రభుత్వం ఇచ్చిన ఉత్తర్వులను స్వాగతిస్తున్నాం. దీని అమలులో మేము కూడా అవసర మైన మేరకు మా వంతు భాగస్వామ్యం అందిస్తాం. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం హర్షణీయమే అయినా, సుదూర ప్రాంత విద్యార్థులకు కొంత ఇబ్బందిగా మారుతుందని నా అభిప్రాయం.

వినియోగదారుల సేవలో గాయత్రి బ్యాంకు

బ్యాంకు అధ్యక్షుడు ముత్యాల లక్ష్మణ్

జగిత్యాల అర్బన్, జూలై 21: అభివృద్ధి పథంలో గాయత్రి బ్యాంకు వినియోగదారులకు మెరుగైన సేవలు అందిస్తుందని గాయత్రి బ్యాంకు అధ్యక్షుడు ముత్యాల లక్ష్మణ్ అన్నారు. గాయత్రి కో ఆపరేటివ్ బ్యాంకు సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన అధ్యక్షులు లక్ష్మణ్ మాట్లాడుతూ 24 సంవత్సరాల కాలంలో 7 లక్షల 25వేల మంది వినియోగదారులను కలిగి మల్టిస్టేట్ కో ఆపరేటివ్ బ్యాంకుగా అవతరించిందన్నారు. రానున్న రోజుల్లో మరో 21 బ్రాంచులను ప్రారంభించుటకు ఏర్పాట్లు చేస్తున్నామని దీంతో మొత్తం 66 బ్రాంచీలకు నెట్‌వర్క్ చేరబోతుందన్నారు. అనంతరం బ్యాంకు సీఈవో వనమాల శ్రీనివాస్ బ్యాంకు వార్షిక నివేదకను సభకు సమర్పించారు. దీంతో పాటు తమవంతు సామాజిక బాధ్యతగా బ్యాంకు యందు సేవింగ్ ఖాతాపై రూ.లక్ష ప్రమాద బీమా సౌకర్యం అందిస్తామని, ఈ స్కీం ద్వారా ఇప్పటివరకు 566 మంది ఖాతాదారుల కుటుంబాలకు రూ. లక్ష అందించి అండగా నిలిచామన్నారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు సభ్యులు మన్నె సౌజన్య, రాజిరెడ్డి, సత్యం, అశోక్, శ్రీనాథ్, విజయ్, మాధవి, రవి కుమార్, సతీష్‌తో పాటు ఇతర సభ్యులు, ఖాతాదారులు, సహకార అధికారులు, పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో గేదె మృతి

కథలాపూర్, జూలై 21 : మండలంలోని పోతారంలో ఆదివారం ప్రమాదావశాత్తు విద్యుదా ఘాతంతో పాలెపు జల అనే మహిళా రైతుకు చెందిన గేదె మృత్యువాత పడింది. కొట్టంలో కట్టేసి ఉంచిన గేదెకు పక్కనే కిందికి ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ వైర్లు తగలడంతో గేదె అక్కడిక్కడే మృత్యువాత పడింది. దీంతో రైతుకు రు. 50 వేల నష్టం సంభవించింది. ప్రభుత్వం బాధిత రైతుకు నష్టపరిహారం అందించి ఆదుకోవాలని ప్రజాప్రతినిధులు కోరారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

రాయికల్ జూలై 21 : ప్రజలు సీజనల్ వ్యాధులు ప్రబలకుండా అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్యాధికారి సమియోద్దీన్ అన్నారు. ఆదివారం మండలంలోని మూటపల్లి గ్రామాన్ని పరివీలించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు సీజనల్ వ్యాధులు రాకుండా తీసుకోవాలిసిన జాగ్రత్తలను వైద్య సిబ్బంది ఎప్పటికప్పుడు అవగాహన కలిపించాలన్నారు. పరిసరాల పరి శుభ్రతతో సీజనల్ వ్యాధులు రావన్నారు. వైద్య సిబ్బంది ఇంటింటికి తిరిగి జ్వర సర్వే చేసి అవసరం ఉన్న వారికి డెంగ్యూ పరీక్షలు చేయించాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల వైద్యాధికారి సతీష్, వైద్యుడు అంజిత్‌రెడ్డి, ఎపిడాల మిస్ట్ వంశీ, సూపర్‌వైజర్ మురళీ, ఆరోగ్య సహాయకుడు భూమన్న సిబ్బంది పాల్గొన్నారు.

వస్త్ర పరిశ్రమ సమస్యలు పరిష్కరించే వరకు ఉద్యమం

సిరిసిల్ల రూరల్, జూలై 21: సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించాలని, అప్పటి వరకు ఉద్యమం కొనసాగిస్తామని సిరిసిల్ల పవర్‌లూం వస్త్ర పరిశ్రమ అనుబంధ పరిశ్రమల సమాఖ్య నాయకులు ప్రకటించారు. జేఏసీ అధ్వర్యంలో సోమవారం నుంచి చేపట్టనున్న రిలే నిరాహార దీక్షల పోస్టర్లను ఆదివారం సిరిసిల్ల పట్టణంలోని వస్త్ర వ్యాపార సంఘం భవనంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా చేనేత వస్త్ర వ్యాపార సంఘం అధ్యక్షులు తాటి పాముల దామోదర్, ఆసాముల సంఘం అధ్యక్షుడు సిరిసిల్ల రవీందర్, ఏఐటీయూసీ, సీఐటీయూ కార్మిక సంఘాల నాయకులు పంతం రవి, కోడం రమణ మాట్లాడారు. నేతన్నలకు ఉపాధి కల్పించాల్సిన ప్రభుత్వం ఎనిమిది నెలలుగా నిర్లక్ష్యం చేస్తోందని, ఇప్పటివరకు దాదాపు 10 మంది మరమగ్గాల కార్మికులు ఉపాధిలేక ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్య చేసుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. యజమానులు, ఆసాములు మరమగ్గాలను తుక్కు కింద అమ్ముకుంటున్నారన్నా రు.ప్రస్తుత అసెంబ్లీ సమావేశాల్లో సీఎం దృష్టికి తీసుకెళ్లేందుకు ఆందో ళనలు చేపడుతున్నట్లు చెప్పారు. సోమవారం పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో చేపట్టే రిలే నిరాహార దీక్షను కార్మికులు, ఆసాములు, యజమానులు విజయవంతం చేయాలని కోరారు. పాలిస్టర్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆడెపు భాస్కర్, కట్టెకోల లక్ష్మీనారాయణ, మండల సత్యం, బండారి అశోక్, గౌడ రాజు, ఏనుగుల ఎల్లయ్య, బూట్ల నవీన్, శ్రీరాం సత్యం, కోడం అశోక్, మండల బాలరాజు, గంగుల శ్రీనివాస్, శ్రీగాధ విష్ణు, అన్నల్‌దాస్ శ్రీనివాస్, సిరిమల్ల సత్యం పాల్గొన్నారు.

మాదిగలను అణచివేస్తున్న రేవంత్‌రెడ్డి

- మాజీ మంత్రి మోత్కుపల్లి నర్సింహులు


సమావేశంలో మాట్లాడుతున్న మోత్కుపల్లి నర్సింహులు

పెద్దపల్లిటౌన్, జూలై 21: మాదిగలను సీఎం రేవంత్‌రెడ్డి అణచివేస్తున్నారని మాజీ మంత్రి మోత్కుపల్లి నర్సింహులు విమర్శించారు. పెద్దపల్లి జిల్లా కేంద్రంలో ఆదివారం జరిగిన మాదిగ శక్తి సదస్సులో ఆయన మాట్లాడారు. రేవంత్‌రెడ్డి ఒక్క మాదిగలనే కాకుండా బీసీలకు అందవలసిన రాజకీయ వాటాను దక్కకుండా చేస్తున్నాడన్నారు. మాదిగలందరు కాంగ్రెస్ పార్టీకి ఓట్లేస్తే ముఖ్యమంత్రి అయ్యాక 80 లక్షల జనాభా కలిగిన మాదిగ జాతిని రాజకీయంగా రేవంత్ రెడ్డి బొంద పెట్టాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. పార్లమెంటు ఎన్నికల్లో మూడు ఎస్సీ రిజర్వుడ్ స్థానాల్లో ఒక్క స్థానాన్ని కూడా మాదిగలకు ఇవ్వలేదన్నారు. ప్రొఫెసర్ కాసీం మాట్లాడుతూ మాదిగలను విడదీయడానికి రాజకీయ నాయకులు కుట్రలు చేస్తారని, ఆ కుట్రలకు మాదిగలు బలి కావద్దన్నారు. సీనియర్ పాత్రికేయుడు విఠల్ మాట్లాడుతూ రాష్ట్రంలో మాదిగలకు రాజకీయంగా జరుగుతున్న అన్యాయాలపై గొంతెత్తవలసిన అవసరం ఉన్నదన్నారు. కేసీఆర్ మోసం చేసిండనే మాదిగలందరు కాంగ్రెస్ పార్టీకి ఓటేస్తే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాదిగలను అన్యాయం చేశాడన్నారు. హైకోర్టు అడ్వకేట్ శరత్‌కుమార్ మాట్లాడుతూ పెద్దపల్లి పార్లమెంటు పరిధిలో మాదిగలకు న్యాయంగా దక్కవలసిన రాజకీయ రిజర్వేషన్లను వెంకటస్వామి కుటుంబమే తన్నుకు పోతోందని, దీనికి రేవంత్‌రెడ్డి సహకరించారని విమర్శించారు. సమావేశంలో తెలంగాణ మాదిగ శక్తి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పినపాటి రజిని, జిల్లా అధ్యక్షుడు కల్లేపల్లి రవి, మంచిర్యాల జిల్లా అధ్యక్షులు నాగుల కిరణ్ బాబు, నియోజక వర్గ అధ్యక్షులు తాళ్ళపెల్లి అంజయ్య, నాయకులు కొమ్ము ప్రవీణ్ బాబు, మడిపెల్లి మొగిలి, బోటుకు రమేష్ బాబు, అక్క పాక తిరుపతి, డాక్టర్ శరత్ బాబు, వివేక్ పటేల్, తాళ్ళ పెల్లి రమేష్, బానోత్ సంజీవ్ నాయక్, మీసాల సాయిలు, దీపక్, తదితరులు పాల్గొన్నారు. పాల్గొన్నారు.

ఎస్సారెస్పీకి పెరుగుతున్న వరద

- ప్రాజెక్టులోకి 18,518 క్యూసెక్కుల నీరు

జగిత్యాల, జూలై 21 (ఆంధ్రజ్యోతి): ఎగువ ప్రాంతాల్లో కురిసిన భారీ వర్షాల కారణంగా శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి ఎగువ వరద నీరు పెరుగుతోంది. ఆదివారం వరద నీరు చేరుతుండడంతో ప్రాజెక్టు నీటి మట్టం క్రమంగా పెరగుతోంది. ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షాలతో పాటు, బాబ్లీ గేట్లు ఎత్తివేయడంతో ఎస్సారెస్పీలోకి 18,518 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతోంది. ప్రాజెక్టు నీటి నిల్వ 90.323 సామర్థ్యానికి ప్రస్తుతం 19.693 టీఎంసీల నీరు నిల్వ ఉంది. గత యేడాది ఇదే సమయానికి ప్రాజెక్టులో 33.317 టీఎంసీల నీరు నిల్వ ఉంది. కాగా మిషన్ భగీరథ, ఇతరములకు కలిపి ప్రాజెక్టు నుంచి 503 క్యూసెక్కుల నీటిని వదిలారు. జూన్ 1వ తేది నుంచి ఇప్పటివరకు ప్రాజెక్టులోకి 13.378 టీఎంసీల వరద నీరు వచ్చి చేరగా, 2.065 టీఎంసీల నీటిని వివిధ అవసరాల నిమిత్తం వ్యయం చేశారు.

పాముకాటుతో యువతి మృతి

సైదాపూర్, జూలై 21: సైదాపూర్ మండలంలోని రాయికల్ తండా గ్రామ పంచాయతీ పరిధిలోని నల్లాని తండా గ్రామానికి చెందిన భర్మావత్ శిరీష(21) అనే యువతి పాముకాటుతో మృతి చెందింది. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం ఈ నెల 16న శిరీష వ్యవసాయ పనులకు వెళ్లింది. పొలం గట్టుపై నుంచి వెళ్తుంగా కాలుకి నల్ల తాచు పాము కాటు వేసింది. వెంటనే శిరిష స్థానికులకు తెలపడంతో స్థానికులు, కుటుంబసభ్యులు వరంగల్ ఎంజీఎంకు తరలించి చికిత్స అందిస్తుండగా చికిత్స పొందుతు ఆదివారం మృతి చెందింది. శిరీష తండ్రి బాబు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై జన్ను ఆరోగ్యం తెలపారు.

బహుజనుల హక్కుల రక్షణ కోసం ఉద్యమిద్దాం

- భీమ్ ఆర్మీ రాష్ట్ర అధ్యక్షుడు వనం మహేందర్


అభివాదం చేస్తున్న మహేందర్, తదితరులు

వేములవాడ టౌన్, జూలై 21: రాష్ట్రంలో దళిత, బహుజన, గిరిజన, ముస్లిం మైనార్టీ హక్కుల రక్షణ కోసం ఉద్యమిద్దామని భీమ్ ఆర్మీ రాష్ట్ర అధ్యక్షుడు వనం మహేందర్ అన్నారు. వేములవాడ పట్టణంలో ఆదివారం ఏర్పాటు చేసిన భీమ్ ఆర్మీ ఆవిర్భావ సభ సందర్భంగా ముఖ్య అతిథిగా మహేందర్ హాజరై మాట్లాడారు. దళిత మైనార్టీల హక్కుల రక్షణ కోసం ఉద్యమిస్తూ అనేక పోరాటాలకు పిలుపునిచ్చి విజయాలు సాధించిన చరిత్ర భీమ్ ఆర్మీకి చెందుతుందని అన్నారు. స్వతంత్రం వచ్చి యేళ్లు గడుస్తున్న దళిత, బహుజన, మైనార్టీలు సామాజిక, ఆర్థిక, రాజకీయా అణచివేతకు గురివుతున్నారన్నారు. బహుజనులు రాజ్యాధికారం వైపు అడుగులు వేస్తే ఈ అణచివేతకు అడ్డుకట్ట వేయవచ్చని భీఎ ఆర్మీ నిరంతరం ప్రజ పోరాటాలు చేస్తూ రాజ్యాధికారం అందించే దిశగా ఉద్యమిస్తుందని వివరించారు. భీమ్ ఆర్మీ ఉద్యమాల్లో విద్యార్థి యువకులు, మేధావులు బడుగు బలహీనవర్గాల వారంత బాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు దొబ్బల ప్రవీణ్‌కుమార్, నవీన్, అక్కనపల్లి శేఖర్, రాంజీ, దినేష్, ప్రదీప్, అరుణ్, సాగర్, రాజు, మహిపాల్, ప్రకాష్ తదితరులు ఉన్నారు.

తల్లి బాగోగులు చూసుకోని కుమారులు

- శిథిలావస్థలో ఉన్న ఇంటిలో వృద్ధురాలు

- కలెక్టర్‌కు కుమార్తె ఫిర్యాదు

కరీంనగర్ రూరల్, జూలై 21: ముసలితనంలో ఆలన పాలన చూడాల్సిన కన్న కొడుకులే పట్టించుకోక పోవడంతో ఆ వృద్ధురాలు అనాథగా మారింది. అధికారుల కథనం మేరకు కరీంనగర్ మండలం నగునూర్ గ్రామంలో కోట లచ్చమ్మ (80)కు నలుగురు కుమారులు, ఒక కుమార్తె. అందులో ఒక కుమా రుడు మృతి చెందాడు. శిథిలావస్థలో ఉన్న ఇంట్లో ఒంటరిగా ఉంటున్న లచ్చమ్మ శనివారం ప్రమాదవశాత్తు జారిపడగా కుమారులతో పాటు కుమా ర్తెకు స్థానికులు సమాచారం అందించారు. కుమార్తె మల్లవ్వ మాత్రమే తల్లి వద్దకు రాగా కుమారులు రాలేదు. లచ్చమ్మ పెద్ద కుమారుడు ప్రభుత్వ ఉద్యోగం చేస్తుండగా, రెండో కుమారుడు తన అత్తగారింటి వద్ద ఉంటున్నాడు. మూడో కుమారుడు నగునూర్‌లోనే వ్యవసాయం చేసుకుంటున్నాడు. నాలుగో కుమారుడు మృతి చెందాడు. దీంతో సోదరులు తన తల్లి బాగోగులు చూడలే దంటూ కలెక్టర్ పమెలా సత్పతికి కుమార్తె ఫిర్యాదుచేసింది. కలెక్టర్ ఆదేశాల మేరకు ఆదివారం తహసీల్దార్ నవీన్, ఆర్ఐ వాస్తవిక్, బ్లూకోర్టు పోలీసులు లచ్చమ్మను చికిత్సకోసం కరీంనగర్ జిల్లా ప్రభుత్వాసుపత్రిలో చేర్పించారు.


వృద్ధురాలిని ఆసుపత్రికి తరలిస్తున్న పోలీస్‌లు, రెవెన్యూ సిబ్బంది

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వర్షం

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మూడు రోజుల నుంచి ఎడతెరిపిలేని వాన కురుస్తోంది. దీంతో చెరువులు నిండుకుండలా మారాయి. వాగులు మత్తడి దూకుతున్నాయి. రోడ్లు జలమయం కాగా ప్రజలు ఇబ్బందులు పడ్డారు. రోడ్డుపై నిలిచిన వాన నీటిని డీఆర్ఎఫ్ సిబ్బంది తొలగించారు.


మత్తడి దూకుతున్న మానకొండూర్ మండలం దేవంపల్లి చెరువు


మత్తడి దూకుతున్న మూలవాగు చెక్‌డ్యాం


చిగురుమామిడి మండలం ఇందారం-కోహెడ మధ్య ఉధృతంగా ప్రవహిస్తున్న వాగు


కోతిరాంపూర్‌లో రోడ్డుపై నిలిచిన వరదనీటిని తొలగిస్తున్న డీఆర్ఎఫ్ సిబ్బంది


వడుకాపూర్ శివారులో హుస్సేన్‌మియా వాగు రోడ్యాంపై ప్రవహిస్తున్న వరద నీరు


పెద్దపల్లి మండలం కొత్తపల్లిలో లోలెవల్ వంతెన వద్ద వరద ఉధృతిని పరిశీలిస్తున్న ఏసీపీ కృష్ణ


చందుర్తి మండలం తిమ్మాపూర్‌లో మత్తడి దూకుతున్న గార్ల కుంట

అంజన్న భక్తుల గిరిప్రదిక్షణ


భక్తులతో సురేష్ ఆత్మరామ్ స్వామిజీ

మల్యాల, జూలై 21: కొండగట్టు గిరిప్రదిక్షణను ఆదివారం చిలుకూరి బాలాజీ స్వామి శివాలయ ప్రధానర్చకులు సురేష్ ఆత్మరామ్ స్వామిజీ ఆధ్వర్యంలో అంజన్న భక్తులు చేశారు. ప్రతి పౌర్ణమి రోజున నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంను 16వసారి నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన అనేక మంది భక్తులు పాల్గొన్నారు. అనంతరం అంజన్న సన్నిధిలో పూజలు నిర్వహించారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

తంగళ్లపల్లి, జూలై 21: అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకున్నట్లు ఎస్సై సుధాకర్ తెలిపారు. ఆదివారం తంగళ్ళపల్లి మండలం దేశాయిపల్లె గ్రామ శివారులో వాగు నుంచి నేరెళ్లకు ఇసుక ను తరలిస్తుండగా పట్టుకొని ట్రాక్టర్లు సీజ్ చేశామని తెలిపారు. ట్రాక్టర్ డ్రైవర్‌తో పాటు ఓనర్‌పై కేసునమోదు చేసినట్లు పేర్కొన్నారు. ఇసుక రవాణా సమాచారాన్ని సేకరించిన సిబ్బంది మల్లేశం, కిరణ్, సంపత్‌ను అభినందించారు.

బతుకమ్మ చీరల బకాయిలు ఎప్పుడిస్తరు?

- రెండేళ్లుగా పెండింగ్‌లో మూడు కోట్ల రూపాయలు
- బిల్లుల కోసం కార్యాలయాల చుట్టూ తిరుగుతున్న నేత కార్మికులు


మగ్గాలపై తయారు చేస్తున్న బతుకమ్మ చీరలు

గంగాధర, జూలై 21: కార్మికులకు ఉపాధి కల్పించడంతో పాటు ఆడబిడ్డలకు దసరా కానుకను అందించడానికి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన బతుకమ్మచీరల బకాయిలు రెండేళ్లుగా నిలిచిపోయాయి. సుమారుగా మూడు కోట్ల రూపాయల బకాయిలు ఎప్పుడిస్తారని మగ్గాల కార్మికులు ఎదురు చూస్తున్నారు. మినీ సిరిసిల్లగా పేరొందిన గంగాధర మండల గర్షకుర్తిలో 16 వందల మగ్గాలపై వస్త్రాలను తయారు చేస్తారు. మగ్గాలపై మూడు వందల మంది ఆసాములు, ఐదు వందల మంది కార్మికులు ఆధారపడ్డారు. చేనేతను బలోపేతం చేయడానికి కార్మికులకు చేతినిండా పనికల్పించేందుకు గత ప్రభుత్వ బతుకమ్మ చీరల తయారిని గర్షకుర్తికి అప్పగించింది. 2022 సంవత్సరానికి 20లక్షలు, 2023 సంవత్సరానికి 34లక్షల మీటర్ల గుడ్డను ఉత్పత్తి చేయడానికి ప్రభుత్వ ఆర్డర్లు ఇచ్చింది. వివిధ రంగులు, డిజైన్లతో బతుకమ్మ పండుగకు నెల రోజుల ముందుగానే అందించాలని అధికారులు తొందరపెట్టగా రాత్రి, పగలు పనిచేసి గడువుకన్నా ముందుగానే చీరలను అందించారు. చీరల తయారీ మూడు నెలల సమయంలో గర్షకుర్తిలో ఎక్కడ చూసినా సాంచల సవ్వడే వినిపిస్తుండేది, వాడవాడల బీములు నింపటోళ్లతో, చీరలను తీసుకెళ్లే ఆటోలతో సందడిగా ఉండేది. అయితే గత ప్రభుత్వ చీరల తయారి చేసిన ఆసాములకు రెండేళ్లుగా డబ్బులు ఇవ్వడం ఆగిపోయింది. చీరల తయారీ బిల్లులు అందించాలని కోరగా 30 శాతం అప్పటి ప్రభుత్వం అందించింది. మరింత రావాల్సి ఉండగా ఎన్నికల కోడ్ రావడంతో అధికారులు చేతులెత్తేశారు. కొత్త ప్రభుత్వం ఏర్పడ్డాకా ఏప్రిల్‌లో బిల్లులు అడగగా 40 శాతం మంజూరు చేసింది. ఇంకా 30 శాతం బిల్లులు రావాల్సి ఉంది. అయితే ఆసాములు కార్మికులకు అప్పులు చేసి జీతాలు ఇచ్చామని ప్రభుత్వం నుంచి బిల్లులురాక మగ్గాలు మూతపడిపోయాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొత్త ప్రభుత్వం చేనేత కార్మికులపై ప్రత్యేక చొరవ తీసుకుని మగ్గాలకు రావాల్సిన పాత బకాయిలు చెల్లించాలని వేడుకుంటున్నారు. సుమారుగా ఒక్క గర్షకుర్తికే 3కోట్ల బకాయిలు రావాల్సి ఉంది.

● రూ. 20 లక్షల వరకు రావాల్సి ఉంది

అలువాల తిరుపతి, ఆసామి గర్షకుర్తి



లక్షల మీటర్ల చీరలను అందించారు. చీరలు తయారు చేసిన వెంటనే డబ్బులు ఇస్తామని అధికారులు తొందర పెట్టి రాత్రీపగలు పనులు చేయించారు. రెండేళ్ల నుంచి నాకు రావాల్సిన రూ. 20లక్షల బిల్లు కోసం కార్యాలయం చుట్టూ తిరుగుతూనే ఉన్నాం. ప్రభుత్వం స్పందించి బిల్లులు అందించి ఆదుకోవాలి.

మద్యం తాగేందుకు దోపిడీ

- ● బంగారు, వెండి గొలుసులతోపాటు ఐఫోన్ అపహరణ
- ● నిందితులను పట్టుకున్న పోలీసులు
- ● వివరాలు వెల్లడించిన డీఎస్పీ

మల్యాల, జూలై 21: ఇద్దరు మిత్రులు మద్యం తాగేందుకు ఓ వ్యక్తి వద్ద దోపిడీకి పాల్పడి నగదు, బంగారు, వెండి గొలుసులతో పాటు ఐఫోన్ అపహరించగా నిందితుల ఊహాచిత్రాల ఆధారంగా పోలీసులు పట్టుకొని కోర్టులో హాజరుపరిచారు. జగిత్యాల డీఎస్పీ రఘుచందర్ ఈ మేరకు మల్యాల పోలీస్‌స్టేషన్‌లో వివరాలు వెల్లడించారు. డీఎస్పీ తెలిపిన వివరాల ప్రకారం.. మల్యాల మండలం రాజారానికి చెందిన గుర్రం వెంకటేష్, మల్యాల మండల కేంద్రానికి చెందిన మల్యాల విష్ణువర్ధన్ మిత్రులు. నాలుగు నెలల క్రితం విష్ణువర్ధన్ దుబాయి వెళ్లి వచ్చాడు. వచ్చాక దావత్ ఇవ్వాలని విష్ణువర్ధన్‌ను అడుగగా ఈ నెల 9న కొండగట్టుకు వచ్చి మార్గమధ్య లోని కొండగట్టు సమీపంలోని పెట్రోల్ బంక్ నుంచి క్వారీల వద్దకు వెళ్లే దారిలో ఇద్దరు మద్యం తాగారు. మరింత మద్యం తాగేందుకు డబ్బులు లేకపోవడంతో దొంగతనం చేసి తాగాలనుకున్నారు. అదే సమయంలో జగిత్యాల మండలం లక్ష్మీపూర్‌కు చెందిన బండారి స్వామి కొడిమ్యాల మండలం నాచుపల్లికి వెలుతున్న క్రమంలో వెంకటేష్, విష్ణువర్ధన్ స్వామిని కర్రలతో కొట్టి అతని మెడలో గల తులం న్నర బంగారు గొలుసు, మూడు తులాల వెండి బ్రాస్‌లెట్, రూ.3500నగదుతో పాటు ఐఫోన్ లాక్కొని పారిపోయారు. దొంగిలించిన వస్తువులను వెంకటేష్ తన ఇంటికి తీసుకెళ్లాడు. బాధితుడు ఇచ్చిన వివరాల ప్రకారం ఊహాచిత్రాలను రుపొందించి, సాంకేతికత ఆధారంగా మళ్లీ చోరీకి ఆదివారం స్కెచ్ వేస్తుండగా పోలీసులు వచ్చి ఇద్దరిని పట్టుకున్నారు. దొంగిలించిన వస్తువుల విలువ రూ.1.50లక్షలు ఉంటుందని డీఎస్పీ తెలిపారు. నిందితుల వద్ద బంగారు, వెండి గొలుసులు, రెండు సెల్‌ఫోన్లు, ద్విచక్రవాహనం స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. సమావేశంలో సీఐ నీలం రవి, ఎస్సై నరేష్‌కుమార్, ఏఎస్సైలు మల్లారెడ్డి, కృష్ణ హెడ్ కానిస్టేబుల్ కనకయ్య, బాష పాల్గొనగా కేసు త్వరితగతిన చేధించిన సీఐ, ఎస్సై, కానిస్టేబుల్లు రాజేందర్, సంతోష్‌లను డీఎస్పీ అభినందించారు.



నిందితుల అరెస్టు చూపుతున్న డిఎస్పీ రఘుచందర్

వివాహిత ఆత్మహత్య

జగిత్యాలరూరల్, జూలై 21: మండలంలోని తిప్పన్నపేట గ్రామానికి చెందిన తూము సుమలత(36) అనే వివాహిత అప్పుల బాధ భరించలేక మనస్తాపానికి గురై పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. జగిత్యాల రూరల్ ఎస్సై సధాకర్ తెలిపిన వివరాల ప్రకారం.. సుమలత భర్త బాలయ్య రెండు సంవత్సరాల క్రితం మృతి చెందాడు. వీరికి ఇద్దరు కూతుర్లు ఉన్నారు. భర్త చనిపోవడంతో కూలీ పనిచేసుకుంటూ సుమలత తన ఇద్దరు కూతుళ్లను పోషించింది. సంవత్సరం క్రితం తన పెద్దకూతురు వైష్ణవికి రూ. 10 లక్షలు అప్పుచేసి పెళ్లి చేసింది. అప్పటి నుంచి అప్పుతీర్చే మార్గం లేకపోవడంతో తరచూ బాధపడుతూ ఉండేది.

ఇదే క్రమంలో ఆదివారం ఉదయం సుమలత పురుగుల మందుతాగి ఆత్మహత్యాయత్నం చేయగా బంధువులు జగిత్యాల ఏరి యా ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది. సుమలత మృతితో బంధువుల రోధనలు మిన్నంటాయి. మృతురాలి తండ్రి పిట్ట రాజం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

చెల్పూర్‌కు పొంచి ఉన్న ముంపు ముప్పు

- ● బ్యాక్ వాటర్‌తో యేటా మునుగుతున్న ఎస్సీ కాలనీ, సమీప గ్రామాలు
- ● వర్షం పడిన ప్రతీసారి సురక్షిత ప్రాంతాలకు తరలింపు

హుజూరాబాద్‌రూరల్, జూలై 21: మండలంలో అతిపెద్ద మేజర్ గ్రామపంచాయతీగా ఉన్న చెల్పూర్‌కు ముంపు ముప్పు పొంచి ఉంది. అటు అధికారులు, పాలకుల నిర్లక్ష్యంతో ప్రతియేటా ప్రజలు నరకాన్ని అనుభవించాల్సిన పరిస్థితి ఏర్పడింది. గ్రామంలోని పెద్ద, చిన్న చెరువుల బ్యాక్ వాటర్ మూలంగా ప్రతియేటా గ్రామంలోని ఎస్సీ కాలనీ, సమీప గ్రామాలు నీటమునుగుతున్నాయి.

● కలగానే మిగిలిన రిజర్వాయర్ నిర్మాణం..

గ్రామంలో 362 ఎకరాల్లో పెద్ద చెరువు, 285 ఎకరాల్లో చిన్న చెరువులు ఉన్నాయి. రెండు చెరువుల మధ్య లింక్ కెనాల్ గ్రామం మధ్యలో నుంచి ఉంది. రెండు చెరువులను కలిపి రిజర్వాయర్‌గా నిర్మిస్తామని అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి మొదలుకొని నిన్నటి ఎన్నికల వరకు ప్రజాప్రతినిదులు హామీలు ఇచ్చారే తప్ప.. హామీ కార్యరూపం దాల్చడం లేదు. రిజర్వాయర్ నిర్మాణం చేపడితే సుమారు 15 గ్రామాల ప్రజలకు లాభం చేకూరే అవకాశం ఉంటుంది.

● వెంటాడుతున్న ప్రధాన సమస్యలు..

రెండు చెరువుల మధ్య గ్రామం మధ్యలో నుంచే వెళ్తున్న లింక్ కెనాల్ సరిగ్గా లేకపోవడంతో సెట్ బ్యాక్ వాటర్‌తో నిత్యం ఎస్సీ కాలనీ నీట మునుగుతుంది. లింక్ కెనాల్‌కు లైనింగ్ చేయిస్తే సమస్య తీరే అవకాశం ఉంటుంది. జూపాక గ్రామం వైపు ఒక మత్తడి, చెల్పూర్‌లో రెండు వైపుల మత్తడి ఉంది.

వానాకాలం మత్తడి ఎక్కువగా ఉంటే జూపాక-చె ల్పూర్ గ్రామాల మధ్య రాకపోకలు నిలిచిపోతాయి. ఒక వేళ పెద్ద చెరువు కట్ట తెగితే ఊరు మునిగిపోయే ప్రమాదం ఉంది. మత్తడిలపై వంతెన నిర్మిస్తే వానాకాలంలో కట్ట తెగితే సహాయక చర్యలు చేపట్టే వీలుంటుంది.


చిన్న చెరువు నుంచి డంప్ అవుతున్న వరద నీరు(ఫైల్)


ఎస్సీ కాలనీలో చుట్టుముట్టిన వరద నీరు(ఫైల్)

● నిర్మాణాలకు నోచుకోని తూములు..

దీనికి తోడు చెరువులకు సంబంధించిన తూములు సైతం నిర్మాణాలకు నోచుకోవడం లేదు. రెండు చెరువులకు సంబంధించిన లింక్ కెనాల్ గ్రామం మధ్యలోని ఎస్సీ కాలనీ గుండా వెళ్తుంది. వానాకాలంలో మాణిక్యాపూర్, నర్సింగాపూర్, కందుగుల గ్రామాల్లోని చెరువుల నీరు, హుజూరాబాద్ పట్టణ శివారులోని చిలుకవాగు వరద నీరు పెద్ద చెరువులోకి వస్తుంది. వరదను పెద్ద చెరువు నుంచి చిన్న చెరువులోకి డంప్ చేసే సమయంలో సెట్ బ్యాక్ వాటర్‌తో ఎస్సీ కాలనీ, సమీప గ్రామాల్లో ఇళ్లు నీటమునుగుతున్నాయి. ఫలితంగా ప్రతియేటా ఎస్సీ కాలనీవాసులను సురక్షిత ప్రాంతాలకు తరలించాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది.

● శాశ్వత పరిష్కారం చూపితే మేలు..

- నేరేళ్ల మహేందర్‌గౌడ్, మాజీ సర్పంచ్, చెల్పూర్



గ్రామంలో ఎస్సీ కాలనీ పక్క నుంచి లింకె కెనాల్ వెళ్తున్న సమయం లో ప్రతియేటా వరద మూలంగా కాలనీ మునుగుతుంది. ఈ సమస్య తీరాలంటే వెంటనే పెద్ద, చిన్న చెరువులను కలుపుతూ రిజర్వాయర్ నిర్మాణం చేపడితే సమస్యకు పరిష్కారం దొరుకుతుంది. అలాగే రిజర్వాయర్ నిర్మాణం చేపడితే సుమారు 15 గ్రామాల ప్రజలకు లాభం చేకూరుతుంది.

తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ

● బంగారం, నగదు అపహరణ

మల్యాల, జూలై 21: మల్యాల మండల కేంద్రంలో శనివారం అర్ధరాత్రి తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ జరిగింది. పుప్పాల దేవయ్య అనే వ్యక్తి శనివారం ఇంటికి తాళం వేసి ఇదే గ్రామంలోని బంధువుల ఇంటికి వెళ్లాడు. ఆదివారం తన ఫోన్‌లో ఇంటి వద్ద ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను పరిశీలిస్తుండగా ఇంటి ద్వారం తెరచి ఉండడం కనిపించింది. దీంతో అతను, బంధువులు వచ్చి పరిశీలించగా గుర్తుతెలియని వ్యక్తులు ద్వారం తాళం, గొళ్లెం పగులగొట్టి లోపలికి వెళ్లి ఇంట్లోని వస్తువులను అస్తవ్యస్తంగా పడేశారు. దీంతో దేవయ్య పోలీసులకు ఫిర్యాదు చేయగా ఎస్సై నరేష్‌కుమార్ సంఘటన స్థలంలో క్లూస్ టీం, డాగ్‌స్క్వాడ్‌తో గాలించారు. బీరువాలోని రూ.43 వేల నగదుతో పాటు తులం బంగారం గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లిన్నట్లు బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై నరేష్‌కుమార్ తెలిపారు

ఇల్లందకుంట ఆలయాభివృద్ధికి కృషి చేస్తా

● రాజ్యసభ సభ్యుడు బండి పార్థసారథిరెడ్డి


రాజ్యసభ సభ్యుడు పార్థసారథిరెడ్డికి స్వాగతం పలుకుతున్న అర్చకులు


ఇల్లందకుంట, జూలై 21: ఇల్లందకుంట సీతారామచంద్రస్వామి ఆలయాభివృద్ధికి తనవంతు తప్పకుండా కృషి చేస్తానని హేటరో డ్రగ్స్ అండ్ ఫార్మసీ ఛైర్మన్, రాజ్యసభ సభ్యుడు బండి పార్థసారథిరెడ్డి అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని సీతారామచంద్రస్వామి ఆలయంలో ఆయన ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ కార్యనిర్వాహణాధికారి కందుల సుధాకర్, అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఈ మేరకు స్వామివారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకోగా, ఆశీర్వచ మండపంలో ఎంపీ పార్థసారథిరెడ్డిని శాలువాతో ఘనంగా సన్మానించి, తీర్థ ప్రసాదాలు, ఆశీర్వచనం, స్వామివారి చిత్రపటాన్ని అందించారు. అనంతరం ఎంపీ పార్థసారథిరెడ్డి మాట్లాడుతూ ఆలయానికి కావాల్సిన అభివృద్ధి పనుల గురించి ఈవో తన దృష్టికి తీసుకవచ్చారని చెప్పారు. ఆలయానికి వచ్చే భక్తుల సౌకర్యార్థం వసతి గృహాలు, ఆలయ కార్యనిర్వాహణాధికారి కార్యాలయం, ఆలయంలో రేకుల షెడ్డు నిర్మాణం, కొతపల్లి, మల్యాల గ్రామ శివారులో రెండు ఆర్చీల నిర్మాణానికి కృషి చేస్తానని తెలిపారు. గతంలో కూడా ఆలయానికి సుమారు మూడు కోట్ల రూపాయలతో సాలారం, రాజగోపురం, బండ పరుపు, స్వామివారి కల్యాణానికి మండపం లాంటి పనులు తన సొంత ఖర్చులతో చేపట్టానని గుర్తు చేశారు. అదేవిధంగా ఆలయ అధికారులు ప్రతిపాదనలు తయారు చేసినట్లయితే తప్పకుండా అభివృద్ధి చేస్తానని పేర్కొన్నారు. గురుపౌర్ణమి సందర్భంగా స్వామివారిని దర్శించుకోవడం చాలా ఆనందంగా ఉందన్నారు. ఆయన వెంట సురేందర్‌రెడ్డి, సంపత్‌రావు, శీలం శ్రీనివాస్, మధు, తిరుపతిరెడ్డి, సుధాకర్‌రెడ్డి, దేవేందర్‌రెడ్డి, నర్సింహారెడ్డి, యాదగిరి, శ్రీనివాస్, సదానందం తదితరులు పాల్గొన్నారు.

నరసింహుని సన్నిధిలో భక్తుల రద్దీ


స్వామి వారి దర్శనం కోసం క్యూలైన్‌లో వేచి ఉన్న భక్తులు

ధర్మపురి, జూలై 21: ధర్మపురి క్షేత్రంలోని లక్ష్మీనరసింహస్వామి సన్నిధిలో ఆదివారం భక్తుల రద్దీ నెలకొంది. ఆషాఢ మాస పౌర్ణమి పురస్కరించుకుని సుదూర ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు గోదావరి నదిలో చేరిన కొత్త నీటితో పుణ్య స్నానాలు ఆచరించారు. అక్కడి నుంచి భక్తులు నేరుగా లక్ష్మీనృసింహ స్వామి, అనుబంధ ఆలయాలకు చేరుకున్నారు. స్వామి దర్శనం కోసం క్యూలైన్‌లో నిలబడి ఆలయాల్లోకి ప్రవేశించారు. అభిషేకాది పూజలు, కుంకుమ అర్చనలు, నిత్య కల్యాణం పూజలు చేయించారు. యమధర్మరాజు ఆలయం వద్ద భక్తులు గండ దీపంలో నూనె పోసి భక్తి ప్రపత్తులు చాటుకున్నారు. అందంగా పూలతో స్వామి వారలను అలంకరణ చేశారు. ఆలయ వేద పండితులు బొజ్జ రమేష్‌శర్మ, సామవేద పండితులు ముత్యాలశర్మ మంత్రోచ్ఛరణల మధ్య అర్చకులు పంచోపనిషత్తులతో క్షీరాభిషేకం, నిత్య పూజలు కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయాలు భక్తి గీతాలతో ప్రతి ధ్వనించాయి. రాత్రి వరకు భక్తులు స్వామి వారలను దర్శనం చేసుకున్నారు. ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్ ఆధ్వర్యంలో సిబ్బంది భక్తులకు తగు సేవలు అందించారు.

ధర్మపురి వద్ద గోదావరి వరద


ధర్మపురి వద్ద స్నానఘట్టాలు ఆనుకుని ప్రవహిస్తున్న గోదావరి నది

ధర్మపురి, జూలై 21: ధర్మపురి వద్ద గోదావరి నది వరద ఆది వారం పెరిగింది. ఎగువ ప్రాంతాల్లో కురిసిన భారీ వర్షాలకు నిండి పోయిన చెరువులు, కుంటలు, వాగుల ద్వారా ప్రవహిస్తున్న నీరు నదిలో చేరుతోంది. దీనికి తోడు కడెం ప్రాజెక్టు గేట్లు ఎత్తి దిగువ గో దావరి నదిలోకి 14,333 క్యూసెక్కుల నీరు విడుదల చేశారు. దీంతో ప్రస్తుతం గోదావరి నీటి ప్రవాహం పెరిగి ప్రజలు ఇబ్బం దులకు గురవుతున్నారు. ధర్మపురి వద్ద ఉసిరిక వాగు దాటి నీటి ప్రవాహం కొనసాగుతుంది. స్నానఘట్టాలు నీటిలో మునిగి పోయా యి. రాత్రి వరకు గోదావరి నది వరద మరింత పెరిగే అవకాశం ఉంది. సమీప గ్రామాలకు చెందిన ప్రజలను అధికారులు అప్రమ త్తం చేశారు. వరద ప్రాంతాన్ని తహసీల్దార్ కృష్ణచైతన్య, సీఐ రాంనర్సింహారెడ్డి, ఎస్ఐ ఉదయ్‌కుమార్ సందర్శించారు.

● కోటిలింగాల వద్ద..

వెల్గటూర్: గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు కోటిలింగాల వద్ద గోదావరి లోకి వరద నీరు చేరుతోంది. కడెం ప్రాజెక్టు నాలుగు గేట్లు ఎత్తి 18227 క్యూసెక్కుల నీటిని దిగువ ప్రాంతానికి వదలడంతో గోదావరిలో నీటి మట్టం పెరుగుతోంది. గోదావరి లోకి వరద నీరు చేరుతుండడంతో పుష్కర ఘాట్ల వరకు నీరు చేరింది. గోదావరిలో వరద నీరు చేరి నీటి మట్టం పెతుండడంతో గొర్ల కాపర్లు, మత్స్యకారులు గోదావరి లోకి వెళ్లవద్దని అధికారులు హెచ్చరికలు జారీ చేశారు. గోదావరిలో పున్య స్నానాలు చేసే భక్తులు లోతు ప్రాంతానికి వెళ్ల వద్దని తహసీల్దార్ శేఖర్, ఎస్సై ఉమా సాగర్ హెచ్చరించారు. కాగా మండలంలో గత రెండు రోజులుగా ముసురు వాన పడుతోంది. దీనితో చెరువులు, కుంటల్లోకి స్వల్పంగా వరద నీరు చేరుతోంది. మండలంలో ఆదివారం 61.4 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు.


కోటిలింగాల వద్ద గోదావరిలో పుష్కర ఘాట్ల వరకు చేరిన నీరు

నిరుపేదలకు ప్రభుత్వ భూమిని పంచాలి

సీపీఎం కేంద్ర కమిటీ సభ్యులు నాగయ్య

జగిత్యాల అర్బన్, జూలై 21: జిల్లా కేంద్రంలోని టీఆర్‌నగర్, కోరుట్ల పట్టణంలో ఉన్న ప్రభుత్వ స్థలాన్ని ఇండ్లులేని నిరుపేదలకు పంచి ఇవ్వాలని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యులు నాగయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పట్టణంలోని రాయల్ ఫంక్షన్ హాల్‌లో సీపీఎం జిల్లా ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించగా, ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా నాగయ్య హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత సంవత్సరం టీఆర్‌న గర్ గుట్ట వద్ద గుడిసెలు వేసుకొని నివాసం ఉంటున్న పేదలపై దాడి చేసి, గుడిసెలు కూల్చి వేయడం దారుణం అన్నారు. వెనువెంటనే కూల్చిన గుడిసెల స్థానంలో పేదలకు ఇంటినిర్మాణం చేసి వాటికి పట్టాలు ఇవ్వాలన్నారు. లేని యెడల రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమిస్తామని హెచ్చరించారు. గత, ప్రస్తుత పాలనకు తేడా ఏమీ లేదని నాగయ్య, విమర్శించారు. ఈ సమావేశంలో పార్టీ బాధ్యులు లెల్లెల్ల బాలకృష్ణ, పుప్పాల శ్రీకాంత్, గర్వందుల రమేష్, వెంకటాచారి, చంద్రయ్య, సురేష్, చంద్రశేఖర్, రఫీక్, శేఖర్ తదితరులున్నారు.

రోడ్డుకు అడ్డంగా తవ్విన కందకాన్ని తొలగించాలి

సమస్యను ఎమ్మెల్యేకు తెలిపిన రైతులు



మెట్‌పల్లి శివారులో రోడ్డుకు అడ్డంగా తవ్విన కందకం

మెట్‌పల్లి, జూలై, 21 : పట్టణం శివారులోని రోడ్డుకు అడ్డంగా తవ్విన కందకాన్ని తొలగించాలని రైతుల కోరారు. ఆదివారం పట్టణంలోని 12వ వార్డు రోడ్డులో ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు కందకం తవ్వాడంతో పోలాలకు వెళ్లడానికి తీవ్ర ఇబ్బందులు పాలవుతున్నట్లు రైతులు సమస్యను కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్‌కు వివరించారు. రైతులు మాట్లాడుతూ గ్రామ శివారులో సుమారు రెండు వందలకు పైగా రైతుల పొలాలు ఉన్నాయన్నారు. 12వ వార్డులో ఉన్న రోడ్డు గుండా ఏండ్ల నుంచి పొలాలకు రైతులు రాకపోకలు కొనసాగిస్తున్నారు. అలాంటి రోడ్డును వార్డుకు సం బంధించిన నాయకుడు కందంక తవ్వించడంతో పొలాలకు రైతులు పోలేని పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. స్పందించిన ఎమ్మెల్యే సమస్యను పరిష్కారించి యధావిధిగా రాకపోకలు వెళ్ళేవిధంగా చేస్తానని తెలిపడంతో వారు వెళ్లిపోయారు.

ఘనంగా గోపాల కాలువలు



ధర్మపురిలో గోపాల కాలువలు నిర్వహిస్తున్న వేద బ్రాహ్మణులు

ధర్మపురి, జూలై 21: వర్షాలు విస్తారంగా కురిసి, పంటలు సమృద్ధిగా పండాలని కోరుతూ ధర్మపురిలో గోపాల కాలువలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. నది నుంచి తీసుక వచ్చిన జలాలతో ఈ నెల 20 నంచి పురాతన శ్రీ రామానందేశ్వ స్వామి ఆలయంలో వేదపండితులు మధ్యాచారి రాంకిషన్, బొజ్జ దత్తాత్రి, బొజ్జ శంకర్, కొరిడె శంకర్‌శర్మ, సంగనభట్ల దత్తాత్రి ఆధ్వర్యంలో 24 గంటల పాటు వేద బ్రాహ్మణులు స్వామి వారలకు సంతత ధారగా మహాన్యాసపూర్వక రుద్రాభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. శివునికి మధ్యాహ్నం అన్నపూజ అనంతరం భక్తి పాటలు పాడుతూ భజనలు చేస్తూ ఊరేగింపుగా గోదావరి నదికి బయలు దేరారు. దారి పొడవుగా మహిళలు బిందెలతో నీరు తీసుక వచ్చి బ్రాహ్మణులపై పోసి వేడుకలు నిర్వహించారు. ఈ కార్య క్రమంలో వేద బ్రాహ్మణులు బొజ్జ రమేష్‌శర్మ, సంగనభట్ల కిషన్, వెంకటరమణ, సాంబమూర్తి, గోపాల్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

గురువుల ఆత్మీయ సమ్మేళనం

వెల్గటూర్, జూలై 21: గురు పౌర్ణమి సందర్భంగా హర్ష, శ్రీహర్ష కళాశాలలో గత 20 సంవత్సరాలుగా అధ్యాపకులుగా సేవలు అందించిన వారంతా ఆదివారం ఒక్క చోట చేరి ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. కళాశాలల యాజమాన్యం ఎర్రంశెట్టి మునీంధర్, సిరిపురం ప్రసాద్‌లు అధ్యాపకులకు జ్ఞాపికలు అందజేసి శాలువాలు కప్పి సన్మానించారు. అనంతరం వారు మాట్లాడుతూ అధ్యాపకుల సేవలు వెలకట్టలేనివని పేర్కొన్నారు. అనంతరం అధ్యాపకులు మా ట్లాడుతూ తమ సేవలను గుర్తించి ఘనంగా సన్మానించినందుకు యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు.

కళాయాత్రికుడికి సత్కారం

మల్యాల, జూలై 21: మంచిర్యాల జిల్లా చెన్నూరుకు చెందిన ఏల్పుల పోచం అనే కళాయాత్రికున్ని మల్యాలలో ఆదివారం ఘనంగా సన్మానించారు. ఆరున్నర సంవత్సరాల పాటు పాదయాత్రతో కాశ్మీరు నుంచి కన్యాకుమారి వరకు గల 9శక్తి పీఠాలు, 8జ్యోతిర్లిం గాలు, 28 రాష్ట్రాలలో 30700కి.మీ చుట్టివచ్చిన పోచంకు మల్యాలలో శ్రీ భక్తమార్కండేయ నాటక కళామండలి ఆధ్వర్యంలో అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు ఆయనను శాలువలతో ఘనంగా సత్కరించారు. కళాకారులు బొద్దుల మహేం ధర్, రాగుల రవీంధర్, పన్నాటి సంతోష్, బాలే శ్రీనివాస్, మోహన్, సుధాకర్, గణేష్, సంతోష్‌లతో పాటు గోవర్ధన్, రాములు, అశోక్ పాల్గొన్నారు

ఘనంగా తీజ్ వేడుకలు

రాయికల్, జూలై 21 : మండలంలోని రాజానగర్‌తండాలో ఆదివారం బంజారాలు తీజ్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలలో బంజారా మహిళలు, యువతులు, చిన్నారులు ఉత్సవాల్లో పాల్గొని సంబురాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో తండా పెద్దలు, ప్రముఖులు పాల్గొన్నారు.

వీఆర్‌ఏల వారసులకు నియామకపు ఉత్తర్వులు ఇవ్వాలి



ఎమ్మెల్సీకి వినతి పత్రం అందజేస్తున్న వీఆర్‌ఏల వారసులు

జగిత్యాల టౌన్, జూలై 21: గత ప్రభుత్వం విడుదల చేసిన 81, 85 జీవో ప్రకారం 3,797మంది 61 ఏళ్ల పైబడిన వీఆర్‌ఏల వారసులకు త్వరితగతిన నియామక ఉత్తర్వులు ఇప్పించాలని కోరుతూ ఆదివారం వీఆర్‌ఏల వారసుల సంఘం నాయకులు ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ 10 ఏళ్లుగా 61 ఏళ్ల దాటిన వీఆర్‌ఏ వారసులం ఉన్నత విద్యార్హతలు కలిగి ఉండి తహసీల్దార్ కార్యాలయాల్లో సేవలందిస్తున్నప్పటికి ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. ఈ సందర్భంగా జీవన్‌రెడ్డి స్పందించి మాట్లాడుతూ వీఆర్‌ఏల వారసుల సమస్యలను సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకవెళ్లి నియామకపు ఉత్తర్వులు ఇచ్చేలా తన వంతు కృషి చేస్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వీఆర్‌ఏల వారసులు రమేష్, తిరుపతి, హన్మంతు ఉన్నారు.

భక్తి శ్రద్ధలతో గురుపౌర్ణమి వేడుకలు



ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న వేద పండితులు

జగిత్యాల టౌన్, జూలై 21 : జిల్లా కేంద్రంలోని బైపాస్ రోడ్‌లో ఉన్న సాయి బాబా దేవాలయంలో ఆదివారం గురు పౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. భక్తులు సాయి బాబాకు అభి షేకాలు నిర్వహించారు. మహిళలు సామూహిక కుంకుమ పూజలు చేపట్టారు. సతీష్ కుమార్, మార కైలాసం, కిషన్ ఉన్నారు.

ధర్మపురి: ధర్మపురి క్షేత్రంలో గురు పౌర్ణమి వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. శ్రీ శివ సాయి బాలాజీ మందిరంలో ఆలయ ట్రస్టీ చైర్మన్ ఒజ్జల ప్రవీణ్‌శాస్త్రి ఆధ్వర్యంలో సామి వారికి అర్చకులు క్షీరాభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు. రామలింగేశ్వర స్వామి ఆలయంలో వేదపారాయణదారు పాలెపు ప్రవీణ్ శర్మ ప్రత్యేక పూజలు చేశారు. రిటైర్డ్ ప్రిన్సిపాల్ కొరిడె విశ్వనాథ్‌శర్మ, కొరిడె నరహరి, ప్రిన్సిపాల్ ప్రభాకర్‌ను లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో శాలువా కప్పి సన్మానించారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ధర్మపురి పట్టణ అధ్యక్షులు రాపర్తి నర్సయ్య, వ్యవస్థాపక అధ్యక్షులు జక్కు రవీందర్, మాజీ అధ్యక్షులు భీమనాతి అశోక్, కోశాధికారి సిరుపతి రాజన్న, చుక్క భీమరాజు, గట్ల శ్రీనివాస్, రవీందర్, రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

కొడిమ్యాల: మండల కేంద్రంలోని సాయిబాబా ఆలయంలో గురు పౌర్ణమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. స్వామి వారికి ప్రత్యేక పూజలు, పల్లకి సేవ కార్యక్రమాలను నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు రమేష్, ఆదిరెడ్డి, శ్రీనివాస్, మహిపాల్, భక్తులు పాల్గొన్నారు.

వెల్గటూర్: మండలంలోని వివిధ గ్రామాలలో గురు పౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. కోటిలింగాలలో శ్రీ పార్వతీ కోటేశ్వర స్వామిని దర్శించుకొని అర్చనలు, అభిషేకాదులు నిర్వహించారు. వెల్గటూర్ శ్రీ భక్తాంజనేయ స్వామి దేవాయంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అర్చకుడు నరసింహ స్వామి ఆధ్వర్యంలో స్వామి వారికి ప్రత్యేక పూజల చేశారు. అనంతరం బండారి గంగాధర్, లావణ్య దంపతులు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మేరుగు మురళి గౌడ్, మాజీ ఉప సర్పంచ్ గుండాటి సందీప్ రెడ్డి, జూపాక కిరణ్, లక్ష్మి నారాయణ, శ్రీనివాస్, సాయి పాల్గొన్నారు.

రాయికల్: మండలంలోని ఇటిక్యాల, కట్కాపూర్ గ్రామాలలోని సాయి బాబా ఆలయాల్లో గురు పౌర్ణమిని పురస్కరించుకొని ఆదివారం భక్తులు వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఇటిక్యాలలో సాయప్ప ట్రస్ట్ ఆధ్వర్యంలో సాయినాథునికి అర్చనలు, అభిషేకం, భక్తులకు అన్నదానం చేశారు. ట్రస్ట్ చైర్మన్ నివేదితకృష్ణారావు, వైస్ చైర్మన్ మంతరావు, బీజేపీ స్టేట్ కౌన్సిల్ మెంబర్ పడాల తిరుపతి పాల్గొన్నారు.

కోరుట్ల : పట్టణంలోని సాయిబాబ దేవాలయంలో గురు పౌర్ణమి వేడుకలను వేదపండితులు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆలయంలో ధ్వజావరోహన కార్యక్రమంతో ఉత్సవాలను ప్రారంభించిన వేదపండితులు అర్చన అభిషేక కార్యక్రమాలను జరిపారు. సాయిబాబ ఉత్సవ మూర్తికి ప్రత్యేక పూజలను జరిపిన వేదపండితులు పల్లకి సేవ కార్యక్రమాన్ని జరిపారు. వేదపండితులు రమేష్ శర్మ, వినయ్, కిరణ్‌లతో పాటు దేవలయ అభివృద్ధి కమిటి, దేవాలయ శాఖ అధికారులు పాల్గొన్నారు.



మెట్‌పల్లిలో సాయిబాబా ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు



సాయిబాబుకు ప్రత్యేక పూజలు చేస్తున్న వేదపండితులు

మెట్‌పల్లి : పట్టణంలోని సాయిబాబా ఆలయంలో గురు పౌర్ణమి వేడుకలను భక్తులు భక్తి శ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. స్వామి వారి పల్లకి సేవ, భజన కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. ఆలయాభివృద్ధి కమిటీ నిర్వహకులు మహాజన్ నర్సింహులు, రాజుకుమార్, మహాజన్ శివకు మార్, తుక్కయ్య, గణేష్, రఘుపతిరెడ్డి, నాగేశ్వర్‌రావు, రాజు, వెంకటాద్రి పాల్గొన్నారు.

మెట్‌పల్లి రూరల్ : మండలంలోని గ్రామాల్లో పౌర్ణమి వేడుకలను భక్తి శ్రద్ధలతో భక్తులు నిర్వహించారు. ఆదివారం గురు పౌర్ణమి పర్వదినం పుస్కరించుకోని సాయి, దత్తాత్రేయ ఆలయాలు భక్తులతో కిక్కిరిసాయి. వెల్లుల్ల గ్రామంలోని ఓంకార దత్తాత్రేయ ఆశ్రమంలో స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో లవకుమార్, గణేష్, స్మరన్, సాగర్, డాక్టర్ దీపక్, శంకర్, భక్తులు పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధి కోసం పోరాటం చేస్తా

కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్

మెట్‌పల్లి, జూలై, 21 : ప్రాణాలు ఉన్నంత వరకు నియోజకవర్గ అభివృద్ధి కోసం పోరాటం చేస్తానని కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ అన్నారు. నియోజకవర్గంలో 53మంది బాధితులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కొత్తగా ఎలాంటి అభివృద్ధి పనులు చేపట్టకుండా మోసపోరిత హామీలతో కాంగ్రెస్ పార్టీ కాలం వెళ్లదీస్తోందన్నారు. మహిళలకు రూ. 2500లు, రైతు బంధు, నిరంతర విద్యుత్ సరఫరా, కల్యాణలక్ష్మీ పథకం కింద తులం బంగారం వంటి హామీలు ప్రభుత్వం ఇవ్వలేక బీఆర్ఎస్‌ను, నాయకులను విమర్శిస్తున్నారన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్, కేంద్రంలో బీజేపీ ప్రజలను మోసం చేస్తున్నాయని విమర్శించారు. నియోజక వర్గంలో ఐదు సార్లు ప్రజలు తరిమినా జువ్వాడి నర్సింగరావు సోదరులు నియోజకవర్గంలోని అధికారులను బెదిరిస్తూ, అభివృద్ధిని అడ్డుకుంటున్నారన్నారు. ప్రజల కోసం కాకుండా తమ స్వలాభాల కోసం నీచపు రాజకీయాలు చేస్తున్న వారిని ప్రజలు నమ్మే పరిస్థితి లేదన్నారు. ఇప్పటికైనా నియోజకవర్గంలోని అభివృద్ధి పనులకు అడ్డు తగలకుండా సహకరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ రానావేణి సుజాత, మాజీ ఎంపీపీ మారు సాయిరెడ్డి, మాజీ సర్పంచులు ఆకుల రాజారెడ్డి, పీసు తిరుపతిరెడ్డి, బద్దం శేఖర్‌రెడ్డి, నాయకులు నల్ల తిరుపతిరెడ్డి, చౌటుపల్లి అంజయ్య, అనిరెడ్డి మారుతిరెడ్డి, తోట శ్రీనివాస్, సందిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, కంఠం రమేష్, మల్లన్న, సుమన్, పాల్గొన్నారు.

మున్సిపల్ కమిషనర్‌పై కోరుట్ల ఎమ్మెల్యే ఫైర్..

మెట్‌పల్లి మున్సిపల్ కమిషనర్ మోహన్‌పై కోరుట్ల ఎమ్మెల్యే ఆదివారం ఫోన్‌లో ఆగ్రహం వ్యక్తం చేశారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం సమీపంలో నూతనంగా నిర్మించిన మోప్మా భవన ప్రారంభ కార్యక్రమాన్ని ఈనెల 22న అధికారికంగా నిర్వహిస్తున్నట్లు, కార్యక్రమానికి హాజరు కావాలని ఎమ్మెల్యేను ఆహ్వానించారు. కానీ కాంగ్రెస్ నాయకులు కార్యక్రమాన్ని నిలిపివేయాలని, సంబంధిత మంత్రి చేతుల మీదుగా ప్రారంభించాంచాలని మున్సిపల్ కమిషనర్‌కు సూచించారు. దీంతో కార్యక్రమాన్ని వాయిదా వేసినట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ సుజాత ఎమ్మెల్యేకు తెలిపారు. అనవసరంగా అభివృద్ధి పనులు ఎందుకు నిలుపుతారు. నియోజకవర్గ ఎమ్మెల్యేను కాకుండా వేరే వారు చెబితే ఎలా మారుస్తావో వివరణ ఇవ్వాలని, ఈ సమస్యలను అసెంబ్లీ ప్రస్తావిస్తానని కమిషనర్‌పై ఫోన్‌లో ఆగ్రహం వ్యక్తం చేశారు.



మెట్‌పల్లిలో మాట్లాడుతున్న కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్

అసోసియేట్ ప్రొఫెసర్‌కు సన్మానం

కొడిమ్యాల, జూలై 21 : వరంగల్ ఎంజీఎం ఆసు పత్రిలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వహించి పదోన్నతిపై ఇటీవల కరీంనగర్ సీవిల్ ఆసుపత్రికి అసోసియేట్ ప్రొఫెసర్‌గా నియామకమైన మండల కేంద్రానికి చెందిన పర్లపల్లి జితెందర్‌ను ఆదివారం కొడిమ్యాల మండల ప్రైవేటు వైద్యులు శాలువా కప్పి ఘనంగా సన్మానం చేశారు. అనంతరం పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్‌ఎంపీ, పీఎంపీ వైద్యుల సంఘం నాయకులు వెంకటేష్‌గౌడ్, ప్రవీణ్, లింగంకు మార్, శ్రీనివాస్, సతీష్‌రెడ్డి, సుదర్శన్, శ్రీనివాస్, ఉన్నారు.

గోరింటాకు సంబరాలు

వెల్గటూర్, జూలై 21: వెల్గటూర్ మండల కేంద్రంలో వైశ్య మహిళలు ఆదివారం స్థానిక ఫంక్షన్ హాల్‌లో గోరింటాకు సంబరాలు జరుపుకున్నారు. ఆషాఢ మాసంలో చేతులకు గోరింటాకు పెట్టుకుంటే ఆరోగ్యంతో పాటు సౌభాగ్యం నిలుస్తుందని మహిళల నమ్మకం. ఈ నేపథ్యంలో మహిళలు గోరింటాకు తీసుక వచ్చి ఒక చోట చేర్చి చుట్టూ పూలతో అందంగా అలంకరించారు. వాసవి మాతను పూలతో అందంగా అలంకరించి పూజించారు. అనంతరం అందంగా అలంకరించిన రోలులో వేసి, రోకలితో దంచారు. అనంతరం ఒకరొకరు చేతులకు గోరింటాకు పెట్టుకొని ఆనందించారు.

గోల్డ్‌మెడల్ అందుకున్న విద్యార్థులు

కొడిమ్యాల, జూలై 21 : మండలంలోని వివిధ గ్రామాల్లో కరాటే నేర్చుకున్న 8 మంది విద్యార్థులు ఆదివారం హైదరాబాదులో నిర్వహించిన అంతర్జాతీయ కరాటే పోటీలలో పాల్గొన్నారు. అత్యంత ప్రతిభ కనపర్చిన ఈ విద్యార్థులు స్టేట్ కిక్ బాక్సింగ్ చాంపియన్ కమలాకర్ చేతుల మీదుగా గోల్డ్‌మెడల్స్‌ను అందుకున్నట్లు కోచ్ బరిగె లక్ష్మీరాజం తెలిపారు. కొంత కాలంగా మండలంలోని చెప్యాల గ్రామానికి చెంది బరిగె లక్ష్మీరాజం పాఠశాల మైదానంలో ఆసక్తి గల విద్యా ర్థులకు కరాటెలో ఉచిత శిక్షణ అందిస్తున్నారు. ఉచిత శిక్షణ ఇస్తున్న కోచ్‌ను, విద్యార్థులను గ్రామస్థులు అభినందించారు.

పోగొట్టుకున్న ఫోన్ అప్పగించిన ఎస్సై

మెట్‌పల్లి, జూలై, 21 : అధునిక పరిజ్ఞానంతో పోగొట్టుకున్న ఫోన్లను వెతికి పట్టుకోవడంలో మెట్‌పల్లి పోలీసులు మంచి ఫలితాలు సాధిస్తున్నారు. పట్టణంలో పోగొట్టుకున్న సెల్ ఫోన్‌ను ఆదివారం ఎస్సై చిరంజీవి యువకుడుకి అందజేశారు. ఎస్సై మాట్లాడుతూ పట్టణంలోని ఇందిర నగర్ కాలనీకి చెందిన కుంట అజయ్ తన ఫోను పోగొట్టుకున్నట్లు పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకోని సెంట్రల్ ఎక్విప్‌మెంట్ ఐడెంటిటీ రిజిస్టర్(సీఈఐఆర్) అప్లికేషన్ ఉపయోగించి పోయిన సెల్ ఫోన్ వెతికి పట్టుకున్నామన్నారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం

కోరుట్ల రూరల్, జూలై 21 : మండలంలోని మోహన్ రావుపేట, వెంకటాపూర్, గుమ్లాపూర్, చిన్నమెట్‌పల్లి గ్రామాలలో ఈ నెల 22న విద్యుత్ సరఫరాలో అంతరాయాలు ఉంటాయని టాన్స్‌కో కోరుట్ల రూరల్ ఎఈ భ్యాక శ్రీనివాస్ ఆదివారం తెలిపారు. ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 12 వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని తెలిపారు. 33 కేవి రాయికల్ ఫీడర్‌లో మరమతుల దృష్టా ఈ గ్రామాలకు విద్యుత్ సరఫరాలో అంతరాలు ఉంటాయని ఎఈ వివరించారు. వినియోగదారులు, రైతులు సహకారం అందించాలని ఎఈ శ్రీనివాస్ కోరారు.

సేవా దృక్పథం అలవర్చుకోవాలి

మున్సిపల్ చైర్ పర్సన్ అడువాల జ్యోతి

జగిత్యాల టౌన్, జూలై 21: ప్రతి ఒక్కరూ సేవా దృక్పతం అలవర్చు కుని సమాజ సేవ చేయాలని మున్సిపల్ చైర్ పర్సన్ అడువాల జ్యోతి, జగిత్యాల డీఎస్పీ రఘు చందర్ పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలో ఆదివారం తెలంగాణ ఉర్దూ వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయగా చైర్ పర్సన్, డీఎస్పీలు హాజరై శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. నిరు పేదలకు ప్రత్యేక వైద్య సేవలు అందిం చేందుకుగాను ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఉర్దూ జర్నలిస్టు సంఘం నాయ కులు ఉన్నారు.

రైతు బీమాకోసం సంప్రదించాలి

సిరిసిల్ల కలెక్టరేట్, జూలై 21 : రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న రైతు బీమా కోసం అర్హులైన రైతులు వ్యసాయాధికారులను సంప్రదించాలని జిల్లా వ్యవసాయా ధికారి భాస్కర్ ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. వ్యవసాయశాఖ రైతు బీమా - 2024 సంవత్సరానికి 1జూన్ 2024 వరకు పాస్‌బుక్ ఉండి 18 సంవత్సరాల నుంచి 59 సంవత్సరాల వయస్సుగల రైతులు నమోదుకు అర్హులని పేర్కొన్నారు. అగస్టు 5లోగా ఏఈవోలకు అవసరమైన పత్రాలను సమర్పించాలని సూచించారు. గతంలో బీమా ఉన్న రైతులు మార్పులు చేర్పులకు జూలై 30, 2024 వరకు అవకాశం ఉందని తెలిపారు.

వర్తకులు సామాజిక సేవలో ముందుండాలి

మున్సిపల్ చైర్మన్ హన్మాండ్లు

రాయికల్, జూలై 21 : వర్తకులు సామాజిక సేవ రంగంలో ముందుండాలని రాయికల్ మున్సిపల్ చైర్మన్ మోర హన్మాండ్లు అన్నారు. ఆదివారం పట్టణంలోని వర్త క సంఘ భవనంలో నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారో త్సవాన్ని నిర్వహించారు. వర్తక సంఘం అధ్యక్షుడిగా ఎలగందుల సత్యనారాయణ, ఉపాధ్యక్షులుగా అనంతుల సంపత్, ముక్క రంజిత్, ప్రధానకార్యదర్శిగా నరంశెట్టి మహేష్, కోశాధికారిగా సిద్దంశెట్టి శ్రీనివాస్, సంయుక్త కార్య దర్శిగా చౌదారపు లక్ష్మీనారాయణతో పాటుగా 11 మంది కార్యవర్గ సభ్యులుగా ప్రమాణ స్వీకారం చేశారు. వైస్ చైర్మన్ గండ రమాదేవి, సింగిల్ విండో చైర్మన్ ఏనుగు మల్లారెడ్డి, కౌన్సిలర్లు తరుగ శ్రీధర్‌రెడ్డి, మహేందర్, డిస్ట్రిబ్యూటర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు పూటూరి నవీన్, డిస్ట్రిబ్యూటర్ మండల అధ్యక్షుడు, గంప ఆనంద్, ప్రెస్ క్లబ్ జేఏసీ అధ్యక్షుడు వాసరి రవి పాల్గొన్నారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి

జిల్లా ఉప వైద్యాధికారి శ్రీనివాస్

వెల్గటూర్, జూలై 21: వర్షాకాలం నేపథ్యంలో పాఠశాల పరిసరాలను పరి శుభ్రంగా ఉంచుకోవాలని జిల్లా ఉప వైద్యాధికారి శ్రీనివాస్ సూచించారు. ఆదివారం స్తంభం పల్లి మహాత్మ జ్యోతిబా పూలే బాలుర గురుకుల పాఠశాలను ఆయన సందర్శించారు. పాఠశాల పరిసరాలను, వంట గది, తరగతి గదులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వర్షా కాలంలో వచ్చే వ్యాధుల పట్ల అవగాహన కల్పించారు.

వ్యాధుల పట్ల విద్యార్థులు అప్ర మత్తంగా ఉండాలని పేర్కొన్నారు. జ్వరం, జలుబు, దగ్గు లాంటివి వస్తే వెంటనే పాఠశాల సిబ్బంది వైద్యులను సంప్రదించి చికిత్స చేయించాలని సూచించారు. విద్యా ర్థులకు వేడిగా ఉన్న నాణ్యమైన భోజనం అందించాలని వంట కార్మికులకు సూచించారు. వైద్య సిబ్బంది, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

'పారిశుధ్యం లోపిస్తే వ్యాధులు ప్రబలే ప్రమాదం'

జగిత్యాలరూరల్, జూలై 21 : గ్రామాల్లో పారిశుధ్యం లోపిస్తే వ్యాదులు ప్రబలే ప్రమాదముందని, ప్రతి ఇంటిలో పరిశుభ్రతపాటించా లని జిల్లా ఉపవైద్యాధికారి శ్రీనివాస్ అన్నారు. జగిత్యాల రూరల్ మండలం అనంతారం గ్రామంలో ఆదివారం డెంగ్యూవ్యాధిపై ప్రజలకు అవగాహన తోపాటు నీటిలో పెరుగుతన్న లార్వా పై ప్రజలను అప్రమత్తం చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఉప వైద్యాధికారి మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని అన్నారు. ఇండ్ల వద్ద నీరు నిల్వకుండా చూసుకోవాలని సూచించారు. గ్రామాల్లో డ్రైనేజీలు శుభ్రంగా ఉంచుకోవాలని కోరారు. గ్రామపంచాయితీలు గ్రామాల్లో క్రమం తప్పకుండా రోజు నీటిని విడుదల చేస్తే గ్రామాల్లో నీరు నిల్వకుండా ఉంటుందని తద్వారా కొంత మేర డెంగీ కేసులను నివారించవచ్చునని పేర్కొన్నారు. జగిత్యాల రూరల్ మండలం అనంతారం గ్రామంలో 1 డెంగీ కేసు నమోదైందని, జిల్లా వ్యాప్తంగా 35 డెంగీ కేసులు నమోదైనట్లు తెలిపారు.

హామీల అమలుకు ప్రజల పక్షాన పోరాటం

బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు శ్రావణి



సమావేశంలో మాట్లాడుతున్న శ్రావణి

జగిత్యాల అర్బన్, జూలై 21: తెలంగాణ ప్రభుత్వం మోస పూరిత హామీలతో గద్దెనెక్కి ప్రజలను మోసం చేసిందని, హామీ లు అమలు అయ్యేంతవరకు బీజేపీ పక్షాన పోరాటం చేస్తామని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు శ్రావణి అన్నారు. జగిత్యాల జిల్లా కేంద్రంలోని స్థానిక కమల నిలయంలో పట్టణ కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన శ్రావణి భవిష్యత్ కార్యాచరణపై కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ దశాబ్దాల పోరాటం తర్వాత సాధించుకున్న తెలంగాణలో కేసీఆర్ పదేళ్ల అహంకార పూరిత పాలనలో రాష్ట్రం పూర్తిగా ధ్వంసం అయ్యిందన్నారు. బీఆర్ఎస్ నియంతృత్వ పాలనపై తీవ్ర అగ్రహంతో ఉన్న ప్రజానీకం ఆరు గ్యారంటీల హామీలు ఇచ్చిన కాంగ్రెస్ పార్టీపై మొగ్గు చూపారన్నారు. ప్రభుత్వం అధికారంలోకి రాగానే హామీలను విస్మరించి ప్రజల ఆశలపై నీళ్లు చల్లిందన్నారు. ఇచ్చిన హామీలను అమలు పర్చేవరకు ప్రజల పక్షాన పోరాటం ఉధృతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో బీజేపీ నాయకులు రంగు గోపాల్, ఆముద రాజు, సిరికొండ రాజన్న, మ్యాదరి అశోక్, మమత, రాజగోపాల్ పాల్గొన్నారు.

అధికారులు అప్రమత్తంగా ఉండాలి

● ప్రజలకు ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలి

● మెట్‌పల్లి ఆర్డీవో శ్రీనివాస్



ఎర్దండి గోదావరి ఉధృతిని పరిశీలిస్తున్న ఆర్డీవో

ఇబ్రహీంపట్నం, జూలై 21 : నిరంతరంగా కురుస్తున్న వర్షాలకు ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండ తక్షణ చర్యలు చేపట్టాలని మెట్‌పల్లి ఆర్డీవో శ్రీనివాస్ అన్నారు. ఆయన అదివారం మండలంలోని పలు గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఎర్దండి గ్రామ శివారులోని గోదావరి నదిని పరిశీలించారు. గోదావరి వైపు ప్రజలు వెళ్లకుండ తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. వర్షకొండ-ఇబ్రహీంపట్నం, యామాపూర్-ఫకీర్ కొండపూర్ గ్రామాల మధ్య ఉన్న లొలెవల్ వంతెనలలు పొంగిపుర్లుతుండటంతో ఇరు గ్రామాల మధ్య రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.

గ్రామాల మధ్య రాకపోకలకు అంతరాయం ఏర్ప డకుండ జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఫకీర్ కొండపూర్- యామాపూర్ గ్రామాల మధ్య తాత్కలికంగా ఎర్పాటు చేసిన వంతెన వరద ఉధృతికి కొట్టుకు పోవడంతో వంతెనను మెట్‌పల్లి డీఎస్పీ ఉమామహేశ్వర్‌రావు, ఇబ్రహీంపట్నం ఎస్ఐ అనిల్‌లు పరిశీలించారు. రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. రాకపోకలకు ప్రత్యామ్నా య మార్గాలు ఏర్పాటు చేయాలని సిబ్బందికి సూచించారు. సిబ్బంది నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండి ఎవరికి ఇబ్బందులు కలుగకుండ చూడాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.